క్లుప్తంగా

ప్రజల సంక్షేమానికి ప్రధాని కృషి

వెల్దండ: ప్రజల సంక్షేమానికి ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌ను గెలిపించుకోవాలని కల్వకుర్తి అసెంబ్లీ కన్వీనర్ శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో పోలింగ్ బూత్ ఇన్‌చార్జిలతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజలందరూ ప్రధాని నరేంద్రమోదీ పాలన కోరుతున్నట్లు పేర్కొన్నారు. 12న హైదరాబాదులోని ఎల్బీస్టేడియంలో సమావేశానికి కేంద్ర మంత్రి అమిత్‌షా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడిగా కుర్మిద్ద యాదగిరి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సింగల్‌విండో వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, బాలస్వామి, మోహన్‌రెడ్డి, జంగయ్యయాదవ్, నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌పీకి మద్దతుగా నిలవాలి

కొల్లాపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ప్రజలు మద్దతుగా నిలవాలని తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్ కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పేద విద్యార్థుల కోసం గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయించడంతో ఆర్‌ఎస్‌పీ పాత్ర మరువలేనిదన్నారు. నిరంతరం బహుజనుల సంక్షేమం కోసం పరితపించే నాయకుడు మన ప్రాంతంలో పోటీ చేయడం స్వాగతించదగ్గ అంశమని తెలిపారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

కల్వకుర్తిరూరల్: వరిపంట సాగుచేసిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్యాంసుందర్ డిమాండ్ చేశారు. మండలంలోని తర్నికల్‌లో రైతులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో రైతులు వరిపంటను సాగుచేశారన్నారు. పంటకు సాగునీరు అందక పోవడంతోపాటు తెగుళ్ల రావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. పంట దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.25 వేలు ఇవ్వాలని కోరారు.

ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

తాడూరు: మండలంలోని ఆకునెల్లికుదురు రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి శనివారం ఉదయం సందర్శించారు. ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయంలో పూజలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఆలయ అభివృద్ధి తనవంతు సహాయసహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట నాయకులు మల్లయ్య, రామచంద్రారెడ్డి, సామయ్య తదితరులు పాల్గొన్నారు.

వంశీకృష్ణారెడ్డి నియామకంపై హర్షం

తెలకపల్లి: సమ్మక్కసారక్క కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ ఓఎస్‌డీగా వంశీకృష్ణారెడ్డి నియామకంపై సీఎల్‌ఆర్ కళాశాల నిర్వాహకులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని చిన్నముద్దునూర్ చెందిన వంశీకృష్ణారెడ్డి సీఎల్‌ఆర్ కళాశాలలో విద్యనభ్యసించారని విద్యాసంస్థల అధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, కిశోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన మరిన్ని పదవులు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

ఇళ్ల మధ్య పాముల సంచారం

తెలకపల్లి: మండల కేంద్రంలోని 8వ వార్డులో పాములు కలకలం రేపుతున్నాయి. శుక్రవారం రాత్రి ఒకే రోజు దాదాపు 10 పాము పిల్లలు ఇళ్ల మధ్యలో సంచరించాయి. ఇక్కడ పాత శ్మశానవాటిక నుంచి పాము పిల్లలు గుంపులుగా పేరుకుపోయి కంపచెట్ల నుంచి ఇళ్లలోకి రావడంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఇళ్ల మధ్యనే పెద్ద ఎత్తున కంపచెట్లు ఉండడంతో పాములకు నిలయంగా మారాయని అవి రాత్రి వేళల్లో సంచరిస్తున్నాయని, దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం పొంచి ఉందోనని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు తీసుకుని, అపరిశుభ్రతను తొలగించి పాముల బెడదను నివారించాలని కోరుతున్నారు.

శ్రీశైలంలో ఉచిత వైద్య శిబిరం

చారకొండ: మండల కేంద్రానికి చెందిన ఆర్‌ఎంపీ శ్రీనివాసులు మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైల పుణ్యక్షేత్రానికి విచ్చేసిన భక్తులకు శ్రీశైలంలో పద్మశాలి సత్రం ఆవరణలో గురువారం నుంచి శనివారం వరకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. 14ఏళ్లుగా పుణ్యక్షేత్రంలో ఉత్సవాలకు వైద్య సేవలు అందిస్తారని తెలిపారు.

మడేశ్వరస్వామి ఉత్సవాలు

అమ్రాబాద్: రజక సంఘం ఆధ్వర్యంలో పదరతో పాటు మండలంలోని వంకేశ్వరంలో మడేలేశ్వర స్వామి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మడేలేశ్వర స్వామి, అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాల వితరణ, అన్నదానం చేశారు.

నల్లమలపై దొంగల కన్ను

- గుప్త నిధుల కోసం అభయారణ్యంలో అన్వేషణ
- పురాతన ఆలయాలే లక్ష్యంగా..
- పర్యాటకులు, చెంచులకు అడవిలో ప్రవేశానికి ఆంక్షలు
- గుప్తనిధుల వేటగాళ్ల ప్రవేశంపై అనుమానాలెన్నో..


నల్లమలలోని దేవుని బొంక


ప్రతాపరుద్రుడి కోటలో తవ్విన గోతి (ఫైల్)

అచ్చంపేట: అమ్రాబాద్ అభయారణ్య ప్రాంతంలో గుప్త నిధుల వేట యథేచ్ఛగా కొనసాగుతుంది. ఇప్పటి వరకు స్మగ్లర్లు అడవిలో లభించే విలువైన వృక్ష సంపదన దోచుకోగా, తాజాగా గుప్తనిధుల కోసం పురాతన ఆలయాలను ధ్వంసం చేస్తున్నారు. నల్లమల అడవిలో విలువైన వజ్రాలు, బంగారం ఉందనే ప్రచారం జోరందుకోవడంతో అడవిపై కన్నేశారు. అసలు నల్లమలలో ఏమీ జరుగుతుందో అంతుబట్టడం లేదు. అడవుల సంరక్షణ, జంతువుల భద్రతపై ప్రత్యేక దృష్టి అటవీశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. కాఆ క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది సహకారంతో గుర్తుతెలియని వ్యక్తులు గుప్త నిధుల అన్వేషణ సాగిస్తున్నారని సమీప గ్రామాలు ప్రజల ఆరోపిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన ముఠాలు లోతట్టు అటవీ ప్రాంతంలోని పురాతన దేవాలయాలను లక్ష్యంగా తవ్వకాలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈమధ్యకాలంలో బల్మూర్ మండలం బాణాల, లక్ష్మీపల్లి, లొద్ది మల్లయ్య ప్రాంతంలో దుండగుల కదలికలు ఉన్నట్లు తెలియడంతో గుప్త నిధుల తవ్వకాల అంశం మరోసారి చర్చనీయంశంగా మారింది.

నల్లమల వాసుల ఆందోళన

నల్లమలలో గుప్తనిధుల తవ్వకాలు జరిపే వారి సంఖ్య పెరిగిపోతుండటంతో స్థానిక ప్రజల ఆందోళనకు గురి చేస్తోంది. గతంలో నల్లమల అటవీప్రాంతంలో నక్సల్స్ ప్రభావం ఎక్కువగా ఉండటంతో కొత్తవారు అడవిలోకి ప్రవేశించాలంటే భయపడేవారు. వారి ప్రభావం తగ్గిపోవడంతో స్మగ్లర్లకు, గుప్త నిధుల కోసం వెతికే ముఠాలకు తమ పని చేసుకోవడం సులువుగా మారింది. అటవీ ప్రాంతంలో ఎన్నో ప్రసిద్ధి చెందిన ఆలయాలు ఉండటంతో వాటిలో గుప్త నిధులు ఉండొచ్చన్న ఆశతో గుట్టు చప్పుడు కాకుండా తవ్వకాలు చేస్తున్నారు.

పురాతన ఆలయాలకు రక్షణేది?

నల్లమల అటవీ ప్రాంతంలో అనేక పురాతన ఆలయాలు ఉన్నాయి. దేశ నలుమూలల నుంచి భక్తులు ఆలయాలను దర్శించుకుంటారు. శ్రీశైలానికి ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వరం, శ్రీశైలం పుణ్యక్షేత్రం, మద్దిమడుగు పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయం, మల్లెలతీర్థం, సలేశ్వరం, లొద్ది మల్లయ్య, బౌరాపూర్ భ్రమరాంబిక దేవి ఆలయం, అక్కమదేవి గుహలు, రాయలగండి చెన్నకేశవ ఆలయాలు ఎంతో ప్రసిద్ధ చెందాయి. గుప్త నిధుల వేటలో భాగంగా దేవతామూర్తుల విగ్రహాలను, ధ్వజస్తంభాలు, ఆలయాలను అనుమానం వచ్చిన ప్రతి చోట తవ్వకాలు చేస్తున్నారు.

అడవిలోకి వెళ్లే అవకాశం లేదు..

అనుమతి లేనిది గుర్తు తెలియని వ్యక్తులు అడవిలోకి వెళ్లే అవకాశం లేదు. తుర్కపల్లి అటవీ ప్రాంతంలో క్షుద్రపూజలు, కొల్లాపూర్ సోమశిల వద్ద గుప్త నిధుల తవ్వకాలు మా దృష్టికి రావడంతో ఇద్దరు వాచర్లు, ఎఫ్‌బీవోను సస్పెన్షన్ చేశాం. అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేసి అడవి భద్రతను కట్టుదిట్టం చేశాం. ట్రాప్ కెమోరాలతో నిఘా పర్యవేక్షణ చేస్తున్నాం. అడవిలో గుర్తు తెలియని వ్యక్తులు, నిషేధిత వస్తువులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం.

– రోహిత్‌గోపిడి, డీఎఫ్‌ఓ, అచ్చంపేట

గతంలో ఎన్నో ఘటనలు

- 2019 ఆగస్టు 10న రాయలగండి వద్ద గుప్త నిధుల కోసం అన్వేషిస్తుండగా స్థానికులు పట్టుకునేందుకు ప్రయత్నించగా దుండగులు పారిపోయారు. మన్ననూర్ వద్ద కారును, గుప్త నిధుల అన్వేషనకు తెచ్చుకున్న పరికరాలు లభించగా పోలీసులకు అప్పగించారు.
- 2019 నవంబరు 20న రాయలగండి లక్ష్మీ చెన్నకేశవ ఆలయం ధ్వజస్తంభం ఎదురుగా ఉన్న అగ్నిగుండాన్ని గుప్త నిధుల కోసం తవ్వారు.
- 2020 ఫిబ్రవరి 10న బౌరాపూర్ భ్రమరాంబికదేవి ఆలయం వద్ద హైదరాబాద్‌కు చెందిన ముఠా పోలీసులకు పట్టుబడింది.
- 2022 నవంబరు 6న హైదరాబాద్–శ్రీశైలం రహదారి పక్కనే ఉన్న ప్రతాపరుద్రుడి కోటపై గుప్త నిధుల తవ్వకాలకు ప్రయత్నించిన ఐదుగురిని అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.
- ఉమామహేశ్వరం క్షేత్రంలో నాగుల విగ్రహాన్ని అపహరించుకపోయారు.
- బల్మూర్ మండలం మైలారం శివాలయం వద్ద గుప్త నిధుల కోసం తవ్వకాలు చేస్తూ పట్టుబడ్డారు.
- ఫిబ్రవరి 12న సోమశిల అర్బన్ పార్కు లోతట్టులోని ఎర్రకుంట, అమరగిరి కృష్ణాతీరం వెళ్లే ప్రాంతంలో గుప్త నిధుల కోసం ప్రొక్లెయిన్‌తో వెళ్లి తవ్వకాలు చేసిన విషయం సీసీ కెమెరాల సహకారంతో గుర్తించి అధికారులు ఎఫ్‌బీవో వెంకటేష్‌ను సస్పెండ్ చేశారు. అనుమతి లేకుండా అడవిలోకి వెళ్లిన ఖదీర్, జాఫర్‌పై కేసు నమోదు చేశారు.
- తాజాగా బల్మూర్ మండలం బాణాల పరిసరాల్లో గుప్త నిధుల అన్వేషణకు దుండగులు ప్రవేశించినట్లు విశ్వసనీయ సమాచారం. అధికారులు అప్రమత్తమై ఈ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపడితే తవ్వకాలు చేస్తున్న విషయం వెలుగుచూసే అవకాశం ఉంది.

ధర్నా విజయవంతం చేయండి


మాట్లాడుతున్న శ్రీనివాసులు

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లాలోని అన్ని నియోజకవర్గకేంద్రాలలో 11న పంచాయతీ సిబ్బంది తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో పంచాయతీవర్కర్స్ నాయకుడు బత్తుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చాలీచాలని వేతనాలతో పూట గడవడమే కష్టంగా ఉన్న పరిస్థితుల్లో ఆరు నెలలుగా వేతనాలు అందకపోవడంతో పంచాయతీ సిబ్బంది దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారని అన్నారు. జీఓ నంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కారోబార్, బిల్ కలెక్టర్‌కు స్పెషల్ స్టేటస్ కల్పించాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల ఎదుట చేపడుతున్న ధర్నా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 21న చలో కమిషనరేట్ కార్యక్రమానికి తరలిరావాలన్నారు. కార్యక్రమంలో మెట్ట మల్లేష్, కుంభం మహేష్, రాములు, పరశురాములు, చంద్రమౌలి, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు నాణ్యతగా నిర్మించాలి

పాన్‌గల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణాలను నిబంధనల మేరకు నాణ్యతగా నిర్మించాలని పీఆర్ ఏఈ రమణ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణంలో నాణ్యతగా నిర్మిస్తూ వాటర్ క్యూరింగ్ తప్పక చేపట్టాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. నాణ్యత లోపిస్తే బిల్లులు చెల్లింపులను నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ అనిల్, బండపల్లి ఎంపీటీసీ ప్రేమ్‌కుమార్, నిరంజన్‌యాదవ్ పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



బల్మూర్: మండల కేంద్రం బల్మూర్–అచ్చంపేట రహదారిలో శనివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. లైసెన్స్ లేని వాహనదారులతో పాటు పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న ప్రైవేట్ వాహనాల డ్రైవర్లకు జరిమానా విధించారు. వాహనదారులు నిబంధనల ప్రకారం నడుచుకోవాలని ఏఎస్‌ఐ రేణయ్య హెచ్చరించారు.

వైభవంగా కల్యాణోత్సవం


వెల్దండ మండలం గుండాలలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో, గ్రామంలోని శివాలయంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణాన్ని శుక్రవారం మధ్యరాత్రి ఘనంగా నిర్వహించారు.

వెల్దండ: మండలంలోని గుండాలలో అంబా రామలింగేశ్వరాస్వామి దేవాలయంలో శనివారం తెల్లవారు జామున 4గంటలకు శివపార్వతులకు అర్చకులు కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను మండల కేంద్రం నుంచి ఊరేగింపుగా నిర్వహించి గుండాలకు తీసుకువచ్చారు.

తాడూరు: మండలంలోని నాగదేవ్‌పల్లిలోని శివాలయంలో శివపార్వతుల కల్యాణం కన్నులపండువగా నిర్వహించారు. శనివారం ఆలయంలో పూజారి హనుమంతు ఆధ్వర్యంలో జలాభిషేకం నిర్వహించిన అనంతరం కల్యాణం జరిపించారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంలో లక్ష్మీయాగం నిర్వహిస్తున్నారు. శనివారం రెండవ రోజు లక్ష్మీసహస్ర నామ స్తోత్రాలు, మహాలక్ష్మి మూలమంత్రహోమం, సహస్రదేవి గాయిత్రి సహిత మహాలక్ష్మి మూల మంత్రహోమం, శ్రీలక్ష్మినర్సింహస్వామి శత్రుంజయ హోమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


పెంట్లవెల్లిలో తేరును లాగుతున్న యువకులు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిలలో వెలసిన లలితా సోమేశ్వరాలయంలో శనివారం శివపార్వతుల కల్యాణం వేదపండితులు ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ఉత్సవ విగ్రహాలను ఆలయ ఆవరణలో ఆసీనులను చేశారు. అనంతరం అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల సమక్షంలో కల్యాణం జరిపించారు. సాయంత్రం స్వామి వారికి రథోత్సవం నిర్వహించారు.

పెంట్లవెల్లి: పెంట్లవెల్లిలోని మహాశివరాత్రి సందర్భంగా రెండు రోజులుగా రామతీర్థ లింగేశ్వరి స్వామి ఆలయంలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం రోజు తెల్లవారుజామున శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించి, అనంతరం సాయంత్రం రథోత్సవాన్ని కొనసాగించారు. రథోత్సవం వద్ద కళాకారులు నృత్యప్రదర్శన చేస్తూ ప్రజలను ఆకట్టుకున్నారు. ముఖ్యంగా శివపార్వతుల వేషధారణ, కేరళ కళాకారుల నృత్య, డప్పు ప్రదర్శన, చెక్కభజన, జడకోలాటం వంటి కార్యక్రమాలను కళాకారులు చేపట్టారు.


వేషధారణలో చిన్నారులు


కేరళ కళాకారుల ప్రదర్శన


పెద్దకొత్తపల్లిలో..

విద్యార్థులకు పరుగుపందెం పోటీలు


బహుమతులు అందించిన సభ్యులు

కల్వకుర్తి : పట్టణంలోని మహాత్మాజ్యోతిబాపూలే బీసీ రెసిడెన్షియల్ విద్యార్థులకు నారిశక్తి ఫిట్‌నెస్‌రన్ పోటీలను శనివారం నిర్వహించారు. నెహ్రూ యువత కేంద్రం, స్వామి వివేకానంద సేవా బృందం ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ అమ్మాయిలు శక్తివంతులని అన్నారు. దేశం కోసం పోరాటం చేసిన, ఉన్నత స్థాయి అధిరోహించిన వారి జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. పోటీలలో గెలిచినవారికి బహుమతులను అందజేశారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎస్‌ఐ రమేష్

అమ్రాబాద్: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ రమేష్ సూచించారు. శనివారం సాయంత్రం మండలంలోని జంగంరెడ్డిపల్లి పంచాయతీ ఆవరణలో కమ్యునిటీ పోలిసింగ్ విధానంపై సమావేశం నిర్వహించారు. ప్రేమ పేరుతో పాటు, చెడు తిరుగుల్ల వల్ల యువత పాడవుతుందని అన్నారు. యువతరం నష్టపోతే కుటుంబం, గ్రామం, మండలం మొత్తం సమాజం కూడా నష్టపోయినట్లేనని, ఇందుకోసం యువత సరైన మార్గంలో నడవాలని సూచించారు.

మల్లురవికి టికెట్ ఇవ్వాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొల్లాపూర్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ టికెట్‌ను మల్లురవికి ఇవ్వాలని కోరుతూ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపదాస్ మున్షీకి వినతిపత్రం అందజేశారు. శనివారం వారు హైదరాబాద్‌లో కలిశారు. పార్టీ కష్టకాలంలో ఉన్న సందర్భంలో మల్లురవి పార్టీ కోసం పాటుపడ్డారని వివరించారు. ఆయనకు పార్లమెంట్ పరిధిలోని ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, ఆయన అయితేనే ఎన్నికల్లో విజయం ఖాయమని వారు తెలియజేశారు. కార్యక్రమంలో జగదీశ్వరుడు, రాముయాదవ్, పరశురాంనాయుడు, కాంతారావు, కృష్ణ, కిరణ్‌కుమార్, భీరయ్యయాదవ్, తదితరులున్నారు. మాల సామాజిక వర్గానికి చెందిన మల్లురవికి టికెట్ ఇవ్వాలని తెలంగాణ మాలల చైతన్య సమితి నాయకులు మద్దెల రాందాసు, బిజ్జ దేవదాసు, వెంకట్రాములు, సందీప్ కాంగ్రెస్ అధిష్టానాన్ని డిమాండ్ చేశారు.

ప్రారంభించకుండానే శిథిలావస్థకు


శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం

తాడూరు: మండలంలోని ఇంద్రకల్‌లో దశాబ్ద కాలం క్రితం పాఠశాల భవనాన్ని ప్రధాన రోడ్డు వద్ద నిర్మించారు. ఏళ్లు గడిచిన భవనం ప్రారంభానికి నోచుకోకపోవడం వల్ల శిథిలావస్థకు చేరుకుంది. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన పాఠశాల భవనం ఉపయోగం లేకుండాపోయింది. ప్రస్తుతం గ్రామంలో ఉన్న మరో పాఠశాల 'మన ఊరు మన బడి'లో మంజూరు కాగా పనులను అసంపూర్తిగా వదిలేశారు. పూర్తయిన భవనాన్ని ప్రారంభించకపోవడం విడ్డూరంగా ఉందని గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు. అధికారులు పరిశీలించి భవనానికి తాత్కాలిక మరమ్మతు నిర్వహించి ఉపయోగంలోకి తేవాలని కోరారు.

ముగిసిన ఉమామహేశ్వర బ్రహ్మోత్సవాలు


కోడేరులో శివపార్వతుల కల్యాణం

కోడేరు: మండల కేంద్రంలోని మూడు రోజుల పాటు సాగిన ఉమామహేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిసాయి. శివపార్వతుల కల్యాణోత్సవం తదితర పూజాలు నిర్వహించి తీర్థ ప్రసాదలు ఇచ్చినట్లు అర్చకులు జంగం శివయ్య, జంగం రాజులు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు వేలాదిగా తరలివచ్చి తమ మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు.

తవ్వారు.. వదిలేశారు


రోడ్డుకు అనుసరించుకుని ఏర్పడిన గుంత

తాడూరు: మండల కేంద్రం నుంచి ఎండబెట్ల మీదుగా జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు ఇంటర్నెట్ సౌకర్యం కోసం తాడూరు సమీపంలో తవ్విన గుంతను పూడ్చడం మరిచిపోయారు. కేబుల్ వైర్ సరిచేసే క్రమంలో రోడ్డును అనుసరించుకుని బీఎస్‌ఎన్‌ఎల్ అధికారులు గుంత తవ్వి పూడ్చకుండా వదిలేశారు. దీంతో రాత్రి వేళ ప్రయాణం ఆందోళనకరంగా మారిందని, ప్రతి రోజు వందల సంఖ్యలో వాహనాలు దారి వెంట వెళ్తుంటాయని, అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చి గుంతను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

నడిరోడ్డులో విద్యుత్ స్తంభం


బల్మూర్‌లో నడిరోడ్డుపై ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ స్తంభం

బల్మూర్: మండల కేంద్రంలోని 11వ వార్డులో నడిరోడ్డుపై విద్యుత్ స్తంభం ప్రమాదభరితంగా మారిందని కాలనీవాసులు చెబుతున్నారు. నాలుగు నెలల క్రితం సీసీ రోడ్లు వేసే సమయంలో రోడ్డుపై ఉన్న స్తంభాన్ని విద్యుత్ శాఖ వారు తొలగించాల్సి ఉన్నా వారు పట్టించుకోలేదు. దీంతో సీసీరోడ్డు అలాగే వేయడంతో రోడ్డుపై నాలుగు చక్రాల వాహనాలు, ఎద్దుల బండ్లు వెళ్లేలేకపోతున్నాయని, రాత్రి వేళ వాహనదారులు గమనించకుండా వస్తే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాన్ని తొలగించాలని కోరుతున్నారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో ఖాళీలను భర్తీ చేయండి

మన్ననూర్: జీఓ నంబర్ 3ని పునరుద్ధరించి ఏజెన్సీ ప్రాంతాలలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ మంత్రి సీతక్కకు గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి శంకర్‌నాయక్ వినతిపత్రం అందించారు. మాచారంలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తూ మన్ననూర్‌లోని అటవీశాఖ విశ్రాంతి గృహంలో ఆమె కాసేపు ఆగారు. ఈ సందర్భంగా మంత్రిని కలిసి మాట్లాడారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్న పదేళ్ల ఏజెన్సీ హక్కులను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీ నిర్వహించి టీచర్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. స్పందించిన మంత్రి సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. సంతోష్‌నాయక్, శ్రీనివాస్‌రాథోడ్, రాజు, బాలు, హన్మంత్‌కోటేష్ ఉన్నారు.